క్లుప్తంగా

వర్షానికి కూలిన గోడ



అజ్జమర్రిలో వానకు కూలిన గోడను చూపుతున్న బాధితుడు మల్లయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో ఆదివారం రాత్రి కరిసిన వర్షానికి ఇంటి ఎదుట నిర్మించుకున్న గోడ కూలింది. బాధితుడు మంగళి మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి కురిసిన గాలి వాన కారణంగా ఇంటి ఎదుట నిర్మించిన గోడతో పాటు ఇంటిపైన నిర్మించిన పిట్ట గోడ సైతం కూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రకృతి వైపరీత్యంతో తాను నష్టపోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని మల్లయ్య కోరాడు.

రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలి



శివ్వంపేటలో బీజేపీ నాయకుల ప్రచారం

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్ అన్నారు. మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. నరేంద్రమోదీ మూడవ సారి దేశ ప్రధాని కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవి, నాయకులు కొండల్‌రావు, భిక్షపతి, అశోక్ సాదుల, ఆంజనేయులు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

సన్మానం



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న రిటైర్డ్ అయిన దేవదాస్, వైద్య సిబ్బందికి వీడ్కోలు పలికారు. సోమవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో దేవదాస్‌ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు సత్కరించారు. అలాగే పదోన్నతిపై బదిలీ అయిన శాంతిశ్రీ, సుప్రియ, శిరీషలను సన్మానించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మడం లేదు'

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజలు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని జిల్లా నాయకులు, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి శేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రవి, వెంకట్‌గౌడ్, భిక్షపతి, మహేందర్‌గౌడ్, సాయికుమార్, శ్రీనివాస్‌గౌడ్, షఫీయోద్దీన్, సాయి తదితరులు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సోమవారం మెదక్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తులు జైశ్రీరామ్ నినాదాలు, భజనలు చేశారు.

ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం పరిశీలన

రామాయంపేట(మెదక్): ఇటీవల మండలంలోని ఆర్‌వెంకటాపూర్‌లో పాక్షికంగా ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర ఇన్‌చార్జి భూంపల్లి బీంరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి చెందిన సంఘం కార్యకర్తలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయకపోతే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. దళిత సంఘాల ప్రతినిధులు కిషన్, రామస్వామి, కృష్ణ, పోచయ్య పాల్గొన్నారు.

పంచాయతీలపై పట్టింపేది?

ఇరుకు గదుల్లో పరిపాలన
ఇంకెన్నాళ్లంటున్న ప్రజలు



తుక్కాపూర్‌లో ఇరుకు గదిలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ



రంగంపేటలో స్లాబ్ స్థాయిలో ఉన్న గ్రామపంచాయతీ భవన నిర్మాణం

కొల్చారం(నర్సాపూర్): గ్రామ పంచాయతీల నిర్మాణాల్లో వేగం కనిపించడంలేదు. ఇరుకు గదుల్లో పరిపాలన ఇంకెన్నాళ్లంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అంటున్నారు. వివిధ గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నూతన గ్రామ పంచాయతీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. కొత్తగా నిర్మాణం చేపట్టిన వాటిలో నిర్మాణ పనుల్లో వేగం తగ్గడం, గతంలో నిధులు మంజూరై నిర్మాణం కాక శిలాఫలకానికే పరిమితమై ఇరుకు గదుల్లో కొనసాగుతున్న గ్రామపంచాయతీలపై ప్రత్యేక కథనం ..

నిర్మాణాల్లో నిర్లక్ష్యం..

ఇరుకు గదుల్లో ఏళ్ల తరబడి కొనసాగుతున్న గ్రామపంచాయతీల స్థానంలో 2016లో కొల్చారం మండలానికి మొదట్లో 4 నూతన గ్రామపంచాయతీలు మంజురయ్యాయి. పోయిన ఏడాదిలో 8 గ్రామ పంచాయతీల నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేశారు. గతంలో కోనాపూర్, కాంగోడ్, పైతర, చిన్నఘనాపూర్‌లో గ్రామపంచాయతీలు మంజూరయ్యాయి. వీటిలో రెండు గ్రామ పంచాయతీలు రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చాయి. మిగతా రెండు గ్రామాల్లో అరకొర వసతులతో అందులోనే పాలన కొనసాగిస్తున్నారు. పైతర గ్రామపంచాయతీ భవన నిర్మాణం 2016 నుంచి స్థల వివాదం కారణంగా శిలాఫలకాలికే పరిమితమైంది. గడిచిన ఏడాదిలో కొత్తగా 8 గ్రామ పంచాయతీలను మంజూరు చేశారు. ఒక్కో గ్రామపంచాయతీ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద రూ.20 లక్షలు మంజూరు చేస్తూ శిలాఫలకాలు వేశారు. వీటిలో ఏటిగడ్డ మాందాపూర్, నాయిని జలాల్‌పూర్ భవనాలు పూర్తయ్యాయి. రంగంపేట, వసురాంతండా, తుక్కాపూర్ భవనాలు స్లాబ్ స్థాయిలో పనులు నిలిచిపోయాయి. సీతారాం తండా, కిష్టాపూర్, వెంకటాపూర్ భవనాలు ముగ్గు పోసే దశలోనే ఉన్నాయి.

నిధుల మంజూరుపై అధికారులు స్పందించి గ్రామ పంచాయతీల నిర్మాణ పనులను వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భవన నిర్మాణం ఏదీ?



మా గ్రామంలో ప్రస్తుతం ఉన్న పంచాయతీ భవనం పూర్తిగా శిథిలమైంది. 9 ఏళ్ల క్రితం నూతన భవనం కోసం శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికీ భవన నిర్మాణంపై ఎవరికి ఊసే లేదు.

– ఎల్లేశం, పైతర

నలుగురం కూర్చోలేకపోతున్నాం

నూతన గ్రామపంచాయతీగా మా గ్రామం ఏర్పాటు కావడం సంతోషం. అయితే పక్క భవనం లేకపోవడంతో రేకులు వేసిన గదిలో గ్రామ పంచాయతీ కొనసాగిస్తున్నారు. లోపల నలుగురు కూడా కూర్చోలేకపోతున్నాం. పనుల కోసం వెళితే ఎండలో వేచి చూడాల్సిందే

– మల్లప్ప, తుక్కాపూర్

చర్యలు తీసుకుంటాం



కొత్తగా నిర్మాణం చేపట్టిన వాటిని త్వరగా పూర్తిచేసేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.మరికొన్ని చోట్ల స్థల వివాదాల కారణంగా సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తడంతో పనులు ప్రారంభించ లేకపోయాం. వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తాం.

– అమరేశ్వర్, డీఈ, పంచాయతీరాజ్

మహిళల రక్షణకు 181 కాల్ చేయండి

సఖి కేంద్రం అధికారి కళావతి



నార్సింగిలో మహిళ రక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి రక్షణకు 181 కాల్ చేయాలని సఖి కేంద్రం అధికారి కళావతి కోరారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సఖి ఆధ్వర్యంలో మహిళల రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపుల నుంచి రక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి ధైర్యం కల్పిస్తుందన్నారు. వరకట్న, గృహహింస, పని ప్రదేశంలో లైంగిక, శారీరక, మానసిక వేధింపుల పరిష్కారం కోసం మహిళలు నేరుగా సఖి కేంద్రంలో ఫోన్ ద్వారా 181, 112, 1098, 1930, 18004198588 నంబర్‌లకు సమాచారం అందించాలని కోరారు. సఖి కేంద్రం ద్వారా పోలీస్, మెడికల్, లీగల్ సపోర్ట్ అందించనున్నట్లు భరోస కల్పించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం పారమెడికల్ అధికారి లక్ష్మి, ఐకేపీ ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెద్దశంకరంపేట(మెదక్): మండల సర్వసభ్య సమావేశాన్ని కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా సోమవారం తెలిపారు. సమావేశానికి సభ్యులు సమావేశానికి రాకపోవడంతో వాయిదా వేశామని, త్వరలో మరో తేదీ తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

పేద ప్రజల శ్రేయస్సుకోసం మోదీ కృషి



మాట్లాడుతున్న లక్ష్మి

రామాయంపేట(మెదక్): పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని అక్కన్నపేటలో సోమవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతుల శ్రేయస్సుకోసం కేంద్రం కృషి చేస్తుందన్నారు. ఈనెల 27న చేగుంటలో పెద్ద ఎత్తున మహిళా మోర్చా సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇతర పార్టీలకు చెందిన మహిళలు బీజేపీలో చేరారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షురాలు వీణ, జిల్లా కార్యదర్శి మహేశ్వరి, మండలాధ్యక్షురాలు రాజమణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోదండ రాముడి ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు సోమవారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని హంసవాహన, పొన్న పల్లకిసేవ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం గరుడసేవ జరుగుతుందని వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ తెలిపారు. చందు పంతులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

మడలేశ్వర శీతలదేవి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో రజక కులస్తుల ఆధ్వర్యంలో సోమవారం మడలేశ్వర శీతల దేవి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు వెంకటరామ్మోహన్ శర్మ, వేలేటి రామ్మోహన్ శాస్త్రి ఎంపీటీసీ బాల్‌రెడ్డి, ఆకుల మహేందర్, కృష్ణగౌడ్, రజక సంఘం సభ్యులు సంగోళ్ల చంద్రం, రాజయ్య, బాల ఎల్లయ్య, బైరయ్య, ముత్తయ్య, నర్సింలు, వెంకయ్య, సురేష్, స్వామి, నితీష్, యాదగిరి, కరుణాకర్, తిరుమలయ్య, మల్లేశం, బాబు, యాదగిరి, రవి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీ పథకంలో వేసవి సందర్భంగా ప్రభుత్వం రూ. 300 కూలీ చెల్లిస్తుందని గిట్టుబాటు కూలీ కోసం కూలీలు కొలతల ప్రకారం పని చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ పుణ్యదాస్ తెలిపారు. సోమవారం మండలంలోని మహ్మద్‌నగర్‌గేట్ తండాతో పాటు పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించి, కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున కూలీలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కూలీలు టీఏ, ఎఫ్ఏ, మేట్ చెప్పిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. లేకపోతే కూలీ డబ్బులు తక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ కూలీలు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఎల్లమ్మ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



పోతంశెట్టిపల్లిలో పూజలు చేస్తున్న పండితులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆవాహిత దేవత పూజలు, హోమాలు, గర్త సంస్కారం, యంత్ర, ప్రాణ ప్రతిష్ఠ అనంతరం అమ్మవారిని గర్భగుడిలో ప్రతిష్ఠించారు. అమ్మవారి కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారికి ఒడి బియ్యం పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అప్పాజీపల్లి గ్రామానికి చెందిన వెంకట్ గౌడ్ సౌజన్యంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద స్వామి పర్యవేక్షణలో కొనసాగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులతో పాటు, బీఆర్‌ఎస్ మండల నాయకులు ఉన్నారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. గౌడ సంఘం ఆధ్వర్యంలో అర్చకులు మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన ఈ కల్యాణోత్సవాన్ని తిలకించడానికి ఆయా గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు మోహన్‌గౌడ్, సత్యంగౌడ్, నాగరాజుగౌడ్, అవినాశ్‌గౌడ్‌తో పాటు గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మెదక్ గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా



రామంతాపూర్ తండాలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా అని, మెదక్‌లో గులాబీ జెండా మరోసారి ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా సోమవారం మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ తండా, రామంతాపూర్, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాసాయిపేట సాయిబాబా, శ్రీ విఠలేశ్వరస్వామి, రామంతాపూర్ తండాలోని సేవాలాల్ ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సేవ చేయాలనే మంచి దృక్పథమున్న వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలం చెందిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలతో పాటు అదనపు పథకాలను సమర్థవంతంగా అమలుచేసిన ఖ్యాతి మాజీ సీఎం కేసీఆర్‌ది అన్నారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, శ్రీనివాస్‌నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణోత్సవం

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి గ్రామంలో సోమవారం బీరప్పస్వామి – కామరాతి కల్యాణోత్సవం ఒగ్గు కళాకారులు కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసుఫ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, అంజయ్య, సాగర్, కిషోర్, పాపయ్య, హరీఫ్, బాలమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి

పెద్దశంకరంపేట(మెదక్): జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గ్రేస్‌బాయి అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్, ఇన్‌చార్జి ఏఓ రాజేష్‌కుమార్, ఆర్ఐ శరణప్ప, ఏఈఓ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి బేతాళస్వామి జాతర

రాష్ట్రంలో మొదటి బేతాళస్వామి ఆలయం



బేతాళ స్వామి ఆలయం



అల్లాదుర్గంలో బేతాళ స్వామి విగ్రహం

అల్లాదుర్గం (మెదక్): భూతాలకు ఆధిపతి బేతాళుడు. రాష్ట్రంలో మెదటి బేతాళస్వామి ఆలయం. మెదక్ జిల్లాలో ఏడపాయల జాతర తర్వాత అల్లాదుర్గం బేతాళ స్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ జాతరకు చుట్టు పక్కల ప్రాంతాల వారితో పాటు కర్నాటక, మహరాష్ట్ర జిల్లాల నలుమూలల నుంచి ప్రజలు హాజరవుతుంటారు.

జాతర కార్యక్రమాలు

బేతాళస్వామి జాతర వారం రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరవుతారు. ఉత్సవ కార్యక్రమాలు 24న పోలేరమ్మ దేవతకు బోనాలు, 25న పోచమ్మ దేవతకు బోనాలు, 26న దుర్గమ్మకు, 27న బేతాళ స్వామికి బోనాలు, 28న బేతాళస్వామి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లను ఊరేగిస్తారు. 29న భజనలు, 30న భాగవతములు, మే1న వినోద కార్యక్రమాలు, 2 ఉదయం బేతాళస్వామికి పాచి బండ్లు తిప్పుతారు. అదే రోజు దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల చుట్టు బండ్లతో ప్రదీక్షణలు చేయడంతో జాతర ముగుస్తుంది. భక్తులు ఉండటానికి రేకుల షెడ్డులు వేశారు. గ్రామ పంచాయతీ ద్వారా భక్తులకు నీటి సౌకర్యం కల్పించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థిక సాయం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన కూని పాపయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం అంబేడ్కర్ సంఘం సభ్యులు రూ. 12 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, సంఘం సభ్యులు బాల్‌రాజ్, సత్యం, కృష్ణ, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ **మెదక్‌లో బీఆర్‌ఎస్ గెలుస్తుంది**

చిన్నశంకరంపేట(మెదక్): పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్‌లో బీఆర్‌ఎస్ గెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. సోమవారం మెదక్ నుంచి హైదారాబాద్ వెళ్తున్న ఆయన చిన్నశంకరంపేటలో ఆగి.. మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులేత్తిసిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రం ఉన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన నాయకులు సురేశ్‌గౌడ్‌తో పాటు పలువురు యువకులు పార్టీలో చేరారు. కాంగ్రెస్‌తోనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు.

◆ **అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డే**

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిల శేరిల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం– 2లో సోమవారం ప్రీ స్కూల్ డే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ దేవలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి హాజరై పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు విద్యార్థులకు కేంద్రంలో అభ్యసించిన పాఠ్యాంశాలు, శారీరక అభివృద్ధి, సామాజిక, వ్యక్తిగత, భావోద్వేక అభివృద్ధి, మేధోవికాసం భాషాభివృద్ధికి దోహద పడతాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఏప్రిల్ నెలలో సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు.

◆ **ధాన్యం కుప్పకు ఢీకొని ఇద్దరికి గాయాలు**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన కల్లాల వల్ల ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి వెల్దుర్తి – నర్సాపూర్ ప్రధాన రహదారి అల్లిపూర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం మంతూర్‌కి చెందిన అనీల్, వెల్దుర్తి మండలం మానేపల్లికి గ్రామానికి చెందిన రాజు బైక్‌పై వెళ్తుండగా అల్లిపూర్ గ్రామ శివారు వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన కల్లాలకు తగిలి అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి.

◆ **కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య**

హవేళిఘణాపూర్(మెదక్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ మండల పరిధిలోని మగ్దూంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మగ్దూంపూర్ గ్రామానికి చెందిన మెట్టు సుభాశ్(31) సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం పోసానిపేటకు 11 ఏళ్ల కిందట ఇల్లరికం వెళ్లాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో సుభాశ్ తల్లివారి గ్రామం మగ్దూంపూర్‌కు వచ్చాడు. తన కుటుంబ సభ్యులకు దూరమయ్యానని తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మెదక్ రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ఉన్నాడు.

◆ **నేడు చాకరిమెట్లలో ప్రత్యేక పూజలు**

శివ్వంపేట(నర్సాపూర్): హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా మంగళవారం చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారికి అభిషేకం తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయస్వామి తెలిపారు.

◆ **నేడు రేగోడ్‌లో అనిల్‌కుమార్ రోడ్ షో**

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ రోడ్ షో ను విజయవంతం చేయాలని మండల ప్రధానకార్యదర్శి రమేశ్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ రానున్నారని చెప్పారు.